
సాక్షి
బాపట్ల

మంగళవారం । 30 । జూలై । 2024



విద్యార్థికి అభినందనలు

బాపట్ల: పదో తరగతిలో 573 మార్కులు సాధించిన బాపట్ల సాంఘిక సంక్షేమ శాఖ హాస్టల్ విద్యార్థి చేబ్రోలు అరవింద్‌ను కలెక్టర్ వెంకట మురళి సోమవారం అభినందించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద సోమవారం 1818 క్యూసెక్కులు విడుదల చేశారు. కొమ్మమూరు కాలువకు 505 క్యూసెక్కులు వదిలారు.



వైభవంగా పవిత్రోత్సవాలు

మోపిదేవి: స్థానిక శ్రీవల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారి దేవస్థానంలో ఆడి కృత్తిక పవిత్రోత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి.

న్యూస్‌రీల్

బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువైఉన్న దుర్గమ్మ ఆలయ బంగారు తాపడం పనులకు గుంటూరుకు చెందిన భక్తులు విరాళం సమర్పించారు. గుంటూరుకు చెందిన ఎస్.సాయివీణ కుటుంబ సభ్యులు సోమవారం దుర్గమ్మ దర్శనానికి ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఆలయ అధికారులను కలిసి బంగారు తాపడం పనులకు రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఆలయ ఈఈ కె.వి.ఎస్.కోటేశ్వరరావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

గుంటూరు రూరల్: నల్లపాడు గ్రామంలోని ఎంబీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాలలో మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ టి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీన ఉదయం 10 గంటల నుంచి స్పాట్ అడ్మిషన్స్ జరుగుతాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని కోరారు. పాలిసెట్ పరీక్ష రాయకపోయినా స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొనవచ్చన్నారు. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో చేరవచ్చని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు పదో తరగతి మార్కుల జాబితా, నాలుగో తరగతి నుంచి పదవ తరగతి వరకూ స్టడీ సర్టిఫికెట్, కుల ధ్రువీకరణ పత్రం, టీసీ, ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్, ఆధార్‌కార్డ్, ఒరిజినల్స్‌తోపాటు మూడు సెట్ల జిరాక్స్ కాపీలతో నేరుగా ఈనెల 31వ తేదీన నల్లపాడు గ్రామంలోని కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్‌లో పాల్గొని సీటు పొంది, రూ.6500 ఫీజును తక్షణమే చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు.

యార్డుకు 40,891 బస్తాల మిర్చి



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు సోమవారం 40,891 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 36,353 బస్తాల అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 16,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 18,500 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 9,500 నుంచి రూ. 15,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 9,000 నుంచి రూ. 18,400 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 15,748 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

164 ఆస్పత్రుల్లో స్కాన్ సెంటర్లకు అనుమతి

నరసరావుపేట: పల్నాడు జిల్లాలో ఇప్పటివరకు 164 ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో లింగ నిర్ధారణ చట్టం పరిధి కింద స్కాన్ సెంటర్లకు అనుమతులు ఇచ్చామని, వీరందరూ చట్టం ప్రకారం అన్ని రికార్డులు నిర్వహించాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి పేర్కొన్నారు. నూతనంగా జిల్లాలో ఏడు స్కాన్‌సెంటర్ల కోసం, మూడు రెన్యువల్, ఎనిమిది మార్పులకోసం దరఖాస్తులు అందజేశారన్నారు. తనిఖీలు నిర్వహించి కలెక్టర్‌కు నివేదించి ఆయన అనుమతితో లైసెన్స్‌లు మంజూరు చేస్తామని అన్నారు. సోమవారం పల్నాడురోడ్డులోని డీఎంహెచ్ఓ కార్యాలయంలో సంబంధిత కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో లింగ నిర్ధారణ చట్టం -1994ను సమర్థంగా అమలు చేయాలని సూచించారు. చట్టం పరిధిని ఎవరైనా అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. లింగనిర్ధారణ చేయటం చట్టరీత్యా నేరమని, చేసినట్లు రుజువైతే శిక్షార్హులవుతారని హెచ్చరించారు. జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, నోడల్ ఆఫీసర్ డాక్టర్ బి.గీతాంజలి పాల్గొన్నారు.

అబ్బురపరుస్తున్న త్రిపురాభినయం



మహిషాసురమర్దినిగా బాలాత్రిపురసుందరి

నెమలికి నడకలు నేర్పే అడుగుల అందాలు ఆమెలోని త్రిపురాభినయాన్ని ప్రదర్శిస్తాయి. నవరసాలు కూచిపూడి నృత్యానికి మేళవించి ప్రేక్షకుల్ని ఆకట్టుకునే రీతిలో ప్రదర్శించగల కళాకారిణి ఆమె. కూచిపూడి నృత్యంలో నాలుగు డిగ్రీలు సాధించారు. దేశీయ, అంతర్జాతీయ వేదికలపైన 1500 పైగా ప్రదర్శనలతో ఆహుతుల్ని రంజింపజేశారు. ఎన్నో జాతీయ, రాష్ట్ర అవార్డులు, రివార్డులు సాధించారు. ఆమె బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి చెందిన చల్లా బాలాత్రిపురసుందరి. అమ్మవారి పేరుకు తగినట్లే కనకదుర్గమ్మను తన హావభావాలతో సాక్షాత్కరింపజేసి ప్రేక్షకుల్ని సంభ్రమాశ్చర్యాలకు గురిచేసే ప్రతిభ ఆమె సొంతం. తన నృత్యంతో పాత్రలో పరకాయ ప్రవేశం చేసి హావభావాలు పలికించడం ఆమెకే సొంతం.

– యద్దనపూడి

- సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదులుకుని శాస్త్రీయ నృత్యంలో రాణిస్తున్న మహిళ
- 1500 పైగా ప్రదర్శనలు, వందల పురస్కారాలు
- అకాడమీ స్థాపించి ఎంతోమంది విద్యార్థులకు శిక్షణ

పువ్వు పుట్టగానే పరిమళిస్తున్నట్లు ఐదో సంవత్సరంలోనే బాలాత్రిపురసుందరి బాలనర్తకిగా అరంగ్రేటం చేశారు. దస్తగిరి రంగనాయకి, చింతారామనాథం, కేవీ సుబ్రమణ్యం తదితర గురువుల వద్ద శాస్త్రీయ నృత్యం అభ్యసించారు. కేవలం నాట్యంతోనే సరిపెట్టకుండా కూచిపూడిలో డిగ్రీలు చేస్తూ ఆ కళను ఆసాంతం సొంతం చేసుకున్నారు. 2004లో పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి యక్షగానంపై డిప్లమా చేసిన ఆమె అనంతర కూచిపూడిలో ఎంఏ చేశారు. ప్రసార భారతి దూరదర్శన్ కేంద్రం నుంచి బీగ్రేడ్ కళాకారిణిగా గుర్తింపు పొందారు. ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్‌లో ప్రథమ శ్రేణి సాధించిన బాలత్రిపురసుందరికి ప్రాంగణ ఎంపికలో విప్రోలో ఉద్యోగానికి ఎంపికైనా నాట్యం మీద మక్కువతో దాన్ని వదులుకున్నారు. అనంతరం ఇతర కంపెనీలు కూడా లక్షల రూపాయల వరకు జీతమిచ్చే కంపెనీలు ఆఫర్ చేసినా నిస్సందేహంగా తిరస్కరించారు. ఉద్యోగం చేస్తే సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లలో ఒక్కదాన్నవుతా.. అదే నృత్యం చేస్తే అరుదైన కళాకారిణిగా మిగులుతా! అనే భావనతో తాను ఎంచుకున్న నృత్యం వైపే మొగ్గు చూపారు.

విద్యార్థులకు నాట్యంలో శిక్షణ

జాతీయ, రాష్ట్రస్థాయి వేదికలపై వేల ప్రదర్శనలతో పాటు తెనాలిలో కల్యాణి కూచిపూడి ఆర్ట్స్ ఆకాడమీ స్థాపించి ఎంతోమంది విద్యార్థులకు నాట్యంలో శిక్షణ ఇస్తున్నారు. ఆన్‌లైన్‌లో ఉత్సాహవంతులైన యువతీ, యువకులకు నాట్యంలో మెలకువలు నేర్పుతున్నారు. 2019లో యద్దనపూడి మండలం అనంతవరానికి చెందిన సాఫ్ట్‌వేర్ రంగ నిపుణులు అద్దంకి ఆదిశేష వెంకటసుబ్రహ్మణ్యాన్ని వివాహమాడారు. కళావేదికలపై భార్య నృత్యానికి ఆకర్షితుడైన ఆయన కూడా ఆమె వద్ద నాట్యం నేర్చుకున్నారు. అనతికాలంలోనే వివిధ నృత్యరూపకాల పాత్రలకు హావభావాలు పలికించడంలో నేర్పు సాధించారు. ఇద్దరు కలిసి తిరుమలలోని నాదనీరాజనంలో ప్రదర్శన ఇచ్చారు. శివపార్వతుల కల్యాణం, శ్రీనివాసకల్యాణం తదితర రూపకాల్లో నాట్య ప్రదర్శన చేశారు.

సాంస్కృతిక శాఖ నుంచి అవార్డు

బాలాత్రిపురసుందరి ప్రతిభను గుర్తించిన ప్రభుత్వం 2017లో సాంస్కృతిక శాఖ నుంచి యంగ్ ట్యాలెంట్ అవార్డుతో సత్కరించింది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పురస్కారంతో పాటు అభినయ నృత్యభారతి ఏలూరి వారి నుంచి నృత్య కౌముది, కళానిలయం చిలకలూరిపేట వారి నుంచి నాట్యమయూరి, సప్తగిరి దూరదర్శన్ హైదరాబాద్ వారి నుంచి బీగ్రేడ్ ఆర్టిస్ట్ హోదాను అందుకున్నారు. మైసూర్, తంజావూరు, తిరుపతి, రవీంద్రభారతి హైదరాబాద్, విశాఖపట్నం, అండమాన్ నికోబార్ దీవులు, భువనేశ్వర్, శ్రీశైలం, విజయవాడ, షిర్డీ, బెంగళూరు, కాలికట్ తదితర ప్రాంతాల్లో శిష్య బృందంతో 1500 పైగా నృత్య ప్రదర్శనలిచ్చి అత్యుత్తమ కళాకారిణిగా బాలత్రిపురసుందరి రాణిస్తున్నారు.

కళామ తల్లికి సేవే లక్ష్యం





చిన్నప్పటి నుంచి నాట్యమంటే ప్రాణం. నృత్య కళాకారిణిగా కళామతల్లికి సేవలందించడమే నా లక్ష్యం. ప్రస్తుతం గ్రామీణ ప్రాంతాల్లో కూడా నృత్యమంటే మక్కువ చూపుతున్న చిన్నారులు ఎంతోమంది ఉన్నారు. కానీ వారికి సరైన దిశానిర్దేశం చేసే వారు లేక చాలామంది మిన్నకుండిపోతున్నారు. తల్లిదండ్రులు కూడా తమ చిన్నారులకు కూచిపూడి, కథక్, భరత నాట్యం.. ఇలా ఎవరికి ఇష్టమైన వాటిలో శిక్షణ ఇప్పిస్తే ఎంతోమంది నృత్యకళాకారులుగా తయారవుతారు. ప్రభుత్వం కూడా ప్రభుత్వ పాఠశాలల్లో నాట్యంపై శిక్షణ తరగతులకు శిక్షకుల్ని నియమిస్తే ఎంతో బాగుంటుంది. నేను కూడా అకాడమి స్థాపించి 150 మందికి పైగా చిన్నారులకు శిక్షణ ఇస్తున్నా. ఆన్‌లైన్ క్లాసులు కూడా నిర్వహిస్తున్నా. నాట్యం నేర్చుకునే ఔత్సాహికులు 85010 28889 నంబర్‌ను సంప్రదిస్తే ఆన్‌లైన్ క్లాసుల ద్వారా శిక్షణ ఇస్తా.

పీహెచ్‌సీలో గడువు తీరిన మందులు

డాక్టర్‌కు, ఫార్మాసిస్ట్ మధ్య విభేదాలు



పీహెచ్‌సీలో మందులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారులు

వేటపాలెం: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గడువు తీరిన మందుల కలకలం రేగింది. సోమవారం పీహెచ్‌సీ డాక్టర్ కాట బాలరాజు వైద్యశాలలో మందుల్ని తనిఖీ చేయగా, గడువు తీరిన మందులు దొరకడంతో డీఎంహెచ్‌వో విజయమ్మకి ఫిర్యాదు చేశారు. ఆమె ఆదేశాల మేరకు కంటివెలుగు ప్రోగ్రాం డాక్టర్ భూషణరావు, డీఎంహెచ్‌వో కార్యాలయ ఫార్మాసిస్ట్ కె.పి. దాసు వేటపాలెం పీహెచ్‌సీకి వచ్చి విచారణ చేపట్టారు. నిల్వ ఉన్న మందుల్ని తనిఖీ చేయగా, కొద్ది మొత్తంలో కాలం చెల్లిన మందులు బయట పడ్డాయి. దీనిపై డీఎంహెచ్‌వోకి నివేదిక అందించనున్నట్లు తెలిపారు.

డాక్టర్ తెచ్చి నా గదిలో ఉంచాడు : ఫార్మాసిస్ట్ వెంకట ప్రసాదరావు

రెండు రోజుల కిందట జరిగిన గొడవను దృష్టిలో పెట్టుకొని తనపై డాక్టర్ అసత్య ఆరోపణలు చేస్తున్నాడని ఫార్మాసిస్ట్ వెంకట ప్రసాదరావు ఆరోపించారు. తాను సోమవారం సెలవు పెట్టి జిల్లా ప్రధాన కేంద్రంలో కలెక్టర్‌కు వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లానని, ఆ సమయంలో డాక్టర్‌తో పాటు అతని నాన్న మరికొంత మంది కాలం చెల్లిన మందులు తన గదిలో పెట్టి ఆరోపణలు చేస్తున్నారని పేర్కొన్నారు. రోగులకు మందులు ఇచ్చే సమయంలో తేదీని క్షుణ్ణంగా పరిశీలించి ఇస్తామని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు కాలం చెల్లిన మందులు ఎవ్వరికీ ఇచ్చిన దాఖలాలు లేవని పేర్కొన్నారు. డాక్టర్‌కు, ఫార్మాసిస్ట్‌కు మధ్య జరుగుతున్న గొడవల కారణంగా రోగులు, సిబ్బందినలిగిపోతున్నారు. ఇంత జరుగుతున్నా జిల్లా అధికారులు చర్యలు తీసుకోకపోవడంతో పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.

కలెక్టరేట్‌కు బాధితుల ‘క్యూ’

- ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదుల వెల్లువ
- సమస్యలు పరిష్కరించాలని పలువురు అర్జీలు
- ఇసుక అక్రమ తవ్వకాలపై చర్యలు తప్పవు
- బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సమస్యలు వెల్లువెత్తాయి. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు చెప్పుకునేందుకు కలెక్టరేట్‌కు తరలివచ్చారు. స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. బాధితులు వినతి పత్రాల ద్వారా సమస్యల్ని కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. తన పరిధిలోని వాటికి ఆయన తక్షణమే పరిష్కార మార్గం చూపగా, మిగిలిన వాటిని విచారించాలని సంబంధిత అధికారుల్ని ఆదేశించారు. తొలుత ఆన్‌లైన్ ద్వారా మండల స్థాయి అధికారులతోనూ ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యతనిస్తూ, తక్షణం పరిష్కరించాలని చెప్పారు. మహిళా, శిశు సంక్షేమ శాఖ పరిధిలో ఏడు, రేపల్లె ఆర్డీవో పరిధిలో ఆరు, చీరాల ఆర్డీవో పరిధిలో రెండు అర్జీలు పెండింగ్‌లో ఉండటంపై ఆయన ఆరా తీశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందనే విషయాన్ని అధికారులు గుర్తించాలని ఆదేశించారు. నిర్లిప్తంగా విధులు నిర్వహిస్తే కుదరదని స్పష్టం చేశారు.

ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలి

ఇసుకను ఇష్టానుసారంగా తవ్వుకుని వెళ్తుంటే అధికారులు నిర్లిప్తంగా చూస్తూ ఉంటారా ? అని కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన ఉచిత ఇసుక విధానాన్ని కొనసాగించాలని తెలిపారు. దళారీల అక్రమాల్ని పూర్తి స్థాయిలో నియంత్రించాలని చెప్పారు. మండల స్థాయిలో ప్రత్యేక కమిటీలు నియమిస్తామని వెల్లడించారు. ఈ కమిటీలు క్షేత్రస్థాయిలో పరిశీలించి తదుపరి ఇచ్చే నివేదిక ఆధారంగా సదరు వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఉపాధి హామీ పథకానికి మార్గదర్శకాలు విడుదలైన నేపథ్యంలో ప్రజా ప్రతినిధులు, పంచాయతీ తీర్మానాల ఆధారంగా పనులు కేటాయించాలని తెలిపారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్ పథకానికి ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. సచివాలయం సిబ్బందితో లబ్ధిదారుల మ్యాపింగ్ చేసి బ్యాంకుల నుంచి నగదు డ్రా చేసి ఇవ్వాలని వివరించారు. పింఛన్ నగదు పంపిణీ చేసే వరకు ఎంపీడీవోలకు, సిబ్బందికి సెలవులు మంజూరు చేయరాదని ఆదేశించారు. జిల్లాస్థాయి అధికారులు సైతం తన అనుమతి పొందాలని స్పష్టం చేశారు. మండల కేంద్రాన్ని విడిచి అధికారులు వెళ్లరాదని సూచించారు. పంద్రాగస్టు వేడుకలలో శకటాలు, స్టాల్స్ ఉండాలని అధికారులకు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ బి. సుబ్బారావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, ఆర్డీవో జి. రవీందర్, ఆయా శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాల నిర్మాణంపై స్పష్టమైన నివేదిక ఇవ్వండి



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్

అధికారులకు కలెక్టర్ జె.వెంకట మురళి ఆదేశం

బాపట్ల: వైద్య కళాశాల నిర్మాణంపై స్పష్టమైన నివేదిక ఇవ్వాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. నిర్మాణంపై సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ, ఇంజినీరింగ్ అధికారులతో సోమవారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. నిజాంపట్నం హార్బర్, వాడరేవు హార్బర్, నిజాంపట్నం సెజ్, చేనేత పార్కు నిర్మాణాల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. వైద్య కళాశాల ద్వారా బాపట్ల జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని, జిల్లాకు తలమానికంగా ఉంటుందని తెలిపారు. నిర్మాణానికి రూ.505 కోట్లు మంజూరైనట్లు వెల్లడించారు. మొదటి దశలో రూ.297 కోట్లు మంజూరయ్యాయన్నారు. అందులో నాబార్డు నుంచి రూ.252 కోట్లు మంజూరు కాగా, మిగతా రూ.45కోట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉందని వివరించారు. 100 సీట్లతో వైద్య కళాశాల, 450 బెడ్లతో ఆసుపత్రి నిర్మించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని పేర్కొన్నారు. 51 ఎకరాల భూమి కేటాయించగా, నిర్మాణ పనులు 15 ఎకరాలలో జరుగుతున్నాయని చెప్పారు. మెగా ఇంజినీరింగ్ వర్క్స్ ఏజెన్సీ ద్వారా 15% పనులు జరిగాయని తెలిపారు. ప్రస్తుతం రూ.70 కోట్ల విలువైన నిర్మాణ పనులు జరిగాయని, రూ.20 కోట్ల వరకు బిల్లులు చెల్లింపులు జరిగాయని కలెక్టర్ వివరించారు. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పనులు జరుగుతున్నాయని చెప్పారు. సమగ్ర నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి పంపుతామని పేర్కొన్నారు. సమావేశంలో ఏపీఎంఐడీసీ ఈఈ శ్రీనివాసరావు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విజయమ్మ, డీసీహెచ్ఎస్ కో-ఆర్డినేటర్ శేషుకుమార్ పాల్గొన్నారు.

కారంచేడులో పాఠశాల లేక విద్యార్థుల అవస్థలు



కారంచేడులో ఇంగ్లిష్ మీడియం స్కూలును ఏర్పాటు చేయాలని న్యాయవాది కృష్ణసింహవర్మరాజు కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. 150మంది విద్యార్థులు పాఠశాల లేకపోవడంతో పక్క గ్రామమైన కుంకలమర్రుకు వెళ్లాల్సివస్తోందని తెలిపారు. పాఠశాల ఏర్పాటు చేయాలని ఎన్నిసార్లు కోరినప్పటికీ ఫలితం లేకుండాపోయిందని వివరించారు.

వలంటీర్ల జీవితాలతో ప్రభుత్వం ఆటలు



వలంటీర్ల పోస్టులను ఇప్పించాలని కోరుతున్న రాజ్యలక్ష్మి, తులసి

తమను విధుల్లోకి తీసుకోవాలని వలంటీర్లు కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు. నిబంధనల ప్రకారం తీసుకున్న తమను ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగాలు లేవని చెప్పటం సరి కాదన్నారు. నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పీహెచ్‌సీ డాక్టర్ వేధింపులు



డాక్టరును సస్పెండ్ చేయాలని ఆందోళన వ్యక్తం చేస్తున్న సిబ్బంది

వేటపాలెం ప్రాథమిక కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కె.బాలరాజుపై చర్యలు తీసుకోవాలని వైద్యశాఖ సిబ్బంది జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళీకి ఫిర్యాదు చేశారు. వైద్యాధికారి వేదింపులతో సిబ్బంది తీవ్ర ఇబ్బందులుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. డాక్టరు ప్రవర్తనపై వెంటనే విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

చారిత్రక సంపదను పరిరక్షించాలి



కలెక్టర్‌తో మాట్లాడుతున్న హెరిటేజ్ సొసైటీ సభ్యులు

మోటుపల్లి చారిత్రక సంపదను పరిరక్షించి, అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ‘మోటుపల్లి హెరిటేజ్ సొసైటీ’ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసింది. మోటుపల్లి ఆలయాలు, శాసనాలు శిథిలావస్థలో ఉన్నాయని, వీటిని భద్రపరిచి, భావితరాలకు అందించాలని వారు కోరారు. వినతి పత్రం అందజేసిన వారిలో హెరిటేజ్ సొసైటీ తరఫున ఆర్. దశరథరామిరెడ్డి, ఫోరమ్ ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు, వేటపాలెం డిగ్రీ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ సత్రం మల్లేశ్వరరావు, పందిళ్లపల్లి హైస్కూల్ పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి వి. శ్రీమన్నారాయణ ఉన్నారు.

చేనేతలను ఆదుకోవాలి



చేనేతల సమస్యల్ని పరిష్కరించాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం సహాయకార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆధ్వర్యంలో నేతలు వినతి పత్రం అందజేశారు. సంక్షోభంలో ఉన్న చేనేతల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. చేనేత సహకార సంఘాలకు వెంటనే కార్యవర్గాన్ని నియమించాలని కోరారు.

స్థలం కేటాయించాలని వినతి



సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ కోసం జమ్ములపాలెం ఫ్లైఓవర్ బ్రిడ్జి కింద ఒక కానాను కేటాయించాలని అసోసియేషన్ నాయకులు గండూరి వీరబ్రహ్మం, కాగిత శ్రీహరిరావు, వెంటేశ్వర్లు కోరారు.సీనియర్ సిటిజన్స్ సమస్యల్ని పరిష్కరించాలని కలెక్టర్‌కు వినతి పత్రం అందించారు.

గిరిజనులకు గూడు కరువు : ఏఐకేఎంఎస్



నల్లమడ డ్రైనేజీపై ఉన్న గిరిజనులకు నివేశన స్థలాలు కేటాయించాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) రాష్ట్ర సహాయ కార్యదర్శి మేకల ప్రసాద్ కోరారు. గిరిజనులకు స్థలాలు లేకపోవటంతో కట్టలపై నివాసాలు ఉంటున్నారని తెలిపారు.వినతిపత్రం ఇచ్చిన వారిలో పాలెపు వెంకాయమ్మ, కోనేటి సీత, రాపూరి ముసలయ్య ఉన్నారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలి



విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్న దళిత నేతలు

కొత్తగా ఏర్పడిన బాపట్ల జిల్లా కలెక్టరేట్‌లో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని అంటరానితన నిర్మూలన పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ జి.చార్వాక వినతి పత్రం ఇచ్చారు. ఎన్నికల సమయంలో విగ్రహాన్ని ఏర్పాటు చేయలేకపోయారని ఆయన తెలిపారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో నాయకులు కోటేశ్వరరావు, వందనం ఉన్నారు.

క్లుప్తంగా

రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి



బాపట్ల: జాతీయ రహదారి పనులు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జేసీ సుబ్బారావు అధికారుల్ని ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో సోమవారం ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇందులో 167–ఏ జాతీయ రహదారి పనులపై సమీక్షించారు. విస్తరణలో ఎదురయ్యే అడ్డంకుల్ని వెంటనే పరిష్కరించాలని జేసీ సూచించారు.

కాలేజీకి వెళ్లిన యువకుడు అదృశ్యం

నెల రోజుల నుంచి కనిపించని వైనం

మార్టూరు: ఇంటి నుంచి నెల రోజుల కిందట కళాశాలకు వెళ్లిన విద్యార్థి అదృశ్యమైన ఘటన మండలంలోని తాటివారిపాలెం గ్రామంలో సోమవారం వెలుగు చూసింది. ఏఎస్‌ఐ మహబూబ్ బాషా వివరాల మేరకు.. గ్రామానికి చెందిన గన్నవరం చెన్నకేశవులు కర్ణాటక రాష్ట్రంలో వ్యవసాయం చేస్తుండగా , ఆయన కుమారుడు గన్నవరపు శివశంకర్ (21) విశాఖపట్నంలోని రఘు ఇంజినీరింగ్ కళాశాలలో నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. అతడు గ్రామంలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. జూన్ 30వ తేదీ కాలేజీకి వెళ్తున్నానని వైజాగ్ బయలుదేరి వెళ్లాడు. అప్పటి నుంచి శివశంకర్ ఫోన్ స్విచ్ ఆఫ్ వస్తూ ఉండటంతో తండ్రి చెన్నకేశవులు కుమారుడి ఆచూకీ కోసం కాలేజీలో ప్రయత్నించగా తిరిగి రాలేదని తెలిసింది. గత నెల రోజులుగా కుమారుడు శివశంకర్ ఆచూకీ కోసం తెలిసిన వారి వద్ద, బంధువుల వద్ద ప్రయత్నించిన చెన్నకేశవులు సోమవారం మార్టూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బాధితుల సమస్యలకు తక్షణ పరిష్కారం

సిబ్బందికి ఎస్పీ తుషార్ డూడి సూచన

బాపట్ల టౌన్: ఫిర్యాదుదారుల సమస్యల్ని తక్షణమే పరిష్కరించాలని ఎస్పీ తుషార్ డూడి సిబ్బందిని ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి 58 మంది సమస్యల్ని ఎస్పీకి విన్నవించారు. కుటుంబ కలహాలు, భూ వివాదాలు, ఇతర సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. ప్రజల సమస్యలి శ్రద్ధగా విన్న ఎస్పీ సంబంధిత పోలీస్‌స్టేషన్ అధికారులతో మాట్లాడారు. ఫిర్యాదుదారుల సమస్యల్ని చట్టపరిధిలో విచారించి, త్వరితగతిన పరిష్కరించాలని పోలీస్ అధికారుల్ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి. విఠలేశ్వర్, సీఐ సిహెచ్.సింగయ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుషార్ డూడి

ఇంటర్నేషనల్ వాలీబాల్ కోచ్ కోర్సుకు మైదవోలు వాసి

రెండు దశల శిక్షణ పూర్తి చేసుకున్న నక్కా శ్రీనివాస్

యద్దనపూడి: అంతర్జాతీయ వాలీబాల్ కోచ్ కోర్సు రెండోదశ శిక్షణకు దేశం నుంచి ఆరుగురు వ్యక్తులు ఎంపికవగా, వీరిలో యద్దనపూడి మండలం మైదవోలు గ్రామానికి చెందిన నక్కా శ్రీనివాస్ ఒకరు. అందులోనూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల నుంచి ఎన్నికైన ఏకైక వ్యక్తి కావడం విశేషం. నక్కా శ్రీనివాస్ తొలుత 2022లో అంతర్జాతీయ స్థాయి వాలీబాల్ కోచ్ కోర్సులో శిక్షణ పొందేందుకు అవకాశం లభించింది. దానిని పూర్తి చేశాక తిరిగి వాలీబాల్ అండర్ –19(బాలుర) విభాగంలో 2023 ఏపీకి, 2023న ఏఎన్‌యూ జట్టు కోచ్‌గా వ్యవహరించారు. కోచ్‌గా క్రీడాకారుల నైపుణ్యాల్ని మెరుగు చేయడంలో కృతకృత్యుడు కావడంతో ఇంటర్నేషనల్ వాలీబాల్ కోర్సు రెండోదశకు ఎంపికయ్యాడు. భారత్ నుంచి 150 మంది ప్రయత్నించగా, ఆరుగురికి మాత్రమే అవకాశం లభించింది. ఇటీవల థాయ్‌ల్యాండ్‌లో జరిగిన ఇంటర్నేషనల్ స్థాయి వాలీబాల్ కోచ్ కోర్సు శిక్షణను దిగ్విజయంగా పూర్తి చేసుకుని



థాయ్‌ల్యాండ్‌లో శిక్షణ పూర్తి చేసుకుని ధ్రువపత్రాన్ని అందుకుంటున్న నక్కా శ్రీనివాస్

శ్రీనివాస్ తిరిగివస్తున్న సందర్భంగా సోమవారం మండల బీజేపీ నాయకులు అభినందించారు. భవిష్యత్తులో వాలీబాల్ శిక్షకులను మెరుగుపరిచి, భావి క్రీడాకారుల్ని తీర్చిదిద్దడంలో తనవంతు కృషి చేసి దేశానికి కీర్తిప్రతిష్టలు తీసుకురావాలని ఆకాంక్షించారు. అభినందించిన వారిలో బీజేపీ నాయకులు వేగేశ్న అంజిరాజు, తులాబంధు సత్యనారాయణ, దాట్ల వెంకటేశ్వరరాజు తదితరులు ఉన్నారు.

కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ అసోసియేషన్ కొత్త కార్యవర్గం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో కాంట్రాక్ట్ నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం కొత్త కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఈ సంఘానికి అధ్యక్షునిగా కంకణాల వెంకట సుధీర్, కార్యదర్శిగా డాక్టర్ దొడ్డక శివరామకృష్ణ, కోశాధికారిగా లంకపల్లి సాంబశివరావు, ఉపాధ్యక్షులుగా టి.సుబ్రమణ్యం, సయ్యద్ అనీషా బేగం, జాయింట్ సెక్రటరీస్‌గా ఎం.శిరీష, జి.రజత, ఎల్. సౌమ్య కార్యవర్గ సభ్యులుగా యు.అన్నామణి, జి.శాంతరాజు, ఎ. మణి, కె.కిశోర్. ఎం.అన్నపూర్ణాదేవి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యవర్గానికి గౌరవ అధ్యక్ష, కార్యదర్శులుగా వికాస అధ్యక్షుడు టి. అనిల్ కుమార్, కార్యదర్శి కె. శ్రీనివాసరావు సలహాదారులుగా కోడూరి కనకరాజు, అజయ్ బాబు వ్యవహరిస్తారని నూతన కార్యవర్గ నాయకులు తెలిపారు.

మృతుల కుటుంబాలకు 'మోపిదేవి' పరామర్శ

నగరం: ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన ముగ్గురి కుటుంబ సభ్యుల్ని సోమవారం రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణారావు మండలంలోని గట్టువారిపాలెంలో పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గట్టు కోటేశ్వరావు, గడ్డం శివనాగులు, గడ్డం లక్ష్మి మృతదేహాల్ని సందర్శించి వారి కుటుంబసభ్యుల్ని ఓదార్చారు. కొలగానివారిపాలెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కొలగాని రమణ తండ్రి ఇటీవల మృతి చెందారు. రమణను ఎంపీ మోపిదేవి పరామర్శించి సానుభూతి తెలిపారు.ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు మోపిదేవి హరినాథబాబు, ప్రసాదం వాసుదేవ ఉన్నారు.



నివాళులర్పిస్తున్న ఎంపీ మోపిదేవి, నేతలు

సహపంక్తి భోజనాలతో సమానత్వ భావన

జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాసరెడ్డి

వేటపాలెం: ప్రభుత్వం పాఠశాలల్లో సహపంక్తి భోజనం వల్ల విద్యార్థుల్లో సమానత్వ భావన కలుగుతుందని బాపట్ల జిల్లా సమగ్ర శిక్షా సీఎంవో శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ, రాష్ట్ర సమగ్ర శిక్షా సంయుక్త ఆధ్వర్యంలో వారం రోజులుగా నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్ ముగింపు సందర్భంగా సోమవారం కొత్తపేట జెడ్పీ హైస్కూల్లో జరిగిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సహపంక్తి భోజనంలో సప్లమెంటరీ న్యూట్రిషన్ల ద్వారా విద్యార్థుల్లో రోగనిరోధకశక్తి పెరుగుతుందని తెలిపారు. దాతల సహకారంతో మధ్యాహ్న భోజనం బలోపేతం చేయాలని చెప్పారు. శిక్షా సప్తాహ్ కార్యక్రమాలు సోమవారం విజయవంతంగా ముగిసినట్లు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కార్యక్రమంలో ఎంఈవో ఐ. పురుషోత్తమరావు, హెచ్‌ఎం గుమ్మా శ్రీనివాసరావు, సీఆర్పీ బత్తుల సుజాత, ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.



విద్యార్థులతో కలసి భోజనం చేస్తున్న అధికారులు

జగ్జీవన్‌రామ్ చైర్ కార్యాలయం మార్పుపై హర్షం

ఏఎన్‌యూ(గుంటూరు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీలోని బాబూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం (చైర్) కార్యాలయం పాత ఎస్‌బీఐ భవనంలోకి మార్చడంపై చైర్ డైరెక్టర్, సిబ్బంది, ఎంఎస్‌ఎఫ్ పరిశోధకులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు. చైర్ డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్, సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు సోమవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు, రెక్టార్ ఆచార్య కె.రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లును కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి ధన్యవాదాలు తెలిపారారు. జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రం డైరెక్టర్ ఆచార్య పీజే రత్నాకర్, ఎంఎస్‌ఎఫ్ నాయకులు మాట్లాడుతూ జగ్జీవన్‌రామ్ అధ్యయన కేంద్రానికి 2018లో అప్పటి అధికారులు పాత ఎస్‌బీఐ కార్యాలయంలో అన్ని వసతులతో కార్యాలయాన్ని కేటాయించారని, ఢిల్లీలోని జగ్జీవన్ రామ్ ఫౌండేషన్‌తో ఎంఓయూ కూడా ఖరారు చేశారన్నారు. తరువాత యూనివర్సిటీలో పదవులు పొందిన ఉన్నతాధికారులు, అధ్యయన కేంద్రం అధికారులు కేంద్రాన్ని ఉద్దేశపూర్వకంగా నిర్వీర్యం చేశారన్నారు. చైర్ కార్యాలయాన్ని చిన్న గదుల్లో మార్చడంతోపాటు అనేక కుట్రలు చేశారని ఆరోపించారు. ప్రస్తుతం పదవుల్లోకి వచ్చిన అధికారులు సమస్యలను పరిగణలోకి తీసుకుని వెంటనే పాత భవనంలోకి కార్యాలయాన్ని మార్చడంతోపాటు అన్ని విధాలుగా సహకారాలు అందిస్తున్నారని తెలిపారు. త్వరలో అధ్యయనకేంద్రం ఆధ్వర్యంలో సదస్సులు, శిక్షణ, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఫౌండేషన్‌తో ఎంఓయూ పునరుద్ధరిస్తామని తెలిపారు. ఉన్నతాధికారుల్ని కలిసిన వారిలో డాక్టర్ సీహెచ్ ఇజ్రాయేలు, డాక్టర్ ఎస్ రాజశేఖర్, వై రాజేష్, శ్రీను, సునీల్, ఆలీ బాషా, దిలీప్, నరేంద్ర, సాల్మన్‌రాజు, బద్రి, ఆదామ్, జకరయ్య తదితరులు ఉన్నారు.



వీసీ గంగాధరరావుకు పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలుపుతున్న ఆచార్యరత్నాకర్

వెల్లివిరిసిన సాంస్కృతిక సౌరభం

- మహాకవి గుర్రం జాషువా పద్యగానం, కవితాలాపన
- వివిధ రంగాల ప్రముఖులకు పురస్కారాల ప్రదానం



'ఫిరదౌసి' ఏకపాత్రలో డాక్టర్ పెద్దీటి యోహాను

తెనాలి: దుగ్గిరాలలోని గుర్రం జాషువా స్మారక కళాపరిషత్ 36వ వార్షికోత్సవం, జాషువా వర్ధంతి కార్యక్రమాలు తెనాలిలో ఆదివారం రాత్రి అట్టహాసంగా జరిగాయి. స్థానిక కొత్తపేటలోని ఎన్జీవో కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి పొద్దుపోయేవరకు వివిధ సాంస్కృతిక, సత్కార కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి డాక్టర్ రంగిశెట్టి రమేష్, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు, డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవి సంయుక్త నిర్వహణలో జాతీయస్థాయి కవి సమ్మేళనం సాగింది. ఎందరో కవులు తమ కవితలను చదివారు. సాయంత్రం నాలుగు గంటలకు జాషువా పద్యపఠనం జరిగింది. జి.ఎస్.రాజు, డి.అనిల్‌కుమార్ నిర్వహణలో జరిగిన పద్యపఠనానికి అవిశ యోహాను హార్మోనియంపై సహకారం అందించారు. సాయంత్రం ఎ.గగనశ్రీ, పి.లౌఖ్యశ్రీల కూచిపూడి నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం డాక్టర్ దీక్షితుల సుబ్రహ్మణ్యం సినీగీతాలను ఆలపించారు. ఈమని శ్రీనివాసరావు, ఆర్. జాకబ్‌లు సంగీత సహకారం అందించారు. సాయంత్రం ఆరు గంటల నుంచి మహాకవి జాషువా రచించిన ఫిరదౌసి ఏకపాత్రను 'అభినవ జాషువ' డాక్టర్ పి.యోహాను అభినయించారు. తదుపరి సత్యహరిశ్చంద్ర ఏకపాత్రను జాషువా పద్యాలతో పి.ఫ్రాన్సిస్ ప్రసాద్ అభినయించారు. రాత్రి ఏడు గంటల్నుంచి మహాకవి జాషువా 53వ వర్ధంతి, సంస్థ 36వ వార్షికోత్సవ సభను నిర్వహించారు. అంతర్జాతీయ జాషువా కళాపరిషత్ చైర్మన్ డాక్టర్ పెద్దీటి యోహాను అధ్యక్షత వహించారు. ఉత్తమ సేవాదంపతులుగా గుంటూరు జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కత్తెర హెనిక్రిస్టినా, కత్తెర సురేష్‌కుమార్‌ను సత్కరించారు. జీసీ రామలింగారెడ్డి (బెంగళూరు), నగేష్ దేవరకొండ (హనుమకొండ), నట్టవ హరగోపాల్ (గుంటూరు), రఘుపాత్రుని గనేశ్వర బాబ్జి (విశాఖపట్నం)కు గౌరవ డాక్టరేట్స్‌ను ప్రదానం చేశారు. డాక్టర్ గంగిశెట్టి రమేష్‌కు పద్మభూషణ్ గుఱ్ఱం జాషువా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్‌ను బహూకరించారు. మహాకవి జాషువ జీవిత సాఫల్య పురస్కారాన్ని డాక్టర్ పి.బాబూరావు (వరంగల్)కు అందజేశారు. వివిధ ప్రాంతాలకు చెందిన 11 మందికి మహాకవి జాషువా పురస్కారాలను ప్రదానం చేశారు. జి.విజయరావ్ స్వాగతం పలికిన సభలో కళాపరిషత్ సంయుక్త కార్యదర్శి జీఎస్ రాజు, అక్షయ సాంస్కృతిక సేవాసమితి దుగ్గిరాల అధ్యక్షులు వి.మేరిసుజాత, ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి, కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి రాజకుమార్, ఆలిండియా హ్యూమన్‌రైట్స్ ఆర్గనైజేషన్ ఏపీ కార్యదర్శి జీసీ రామలింగారెడ్డి, డాక్టర్ యూవీ రత్నం, డాక్టర్ కాటూరి ప్రభుదాస్, సీహెచ్ జాన్‌సుందరరావు, జుజ్జువరపు న్యూటన్, కార్యదర్శి వి.ప్రకాశరావు మాట్లాడారు.



జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీక్రిస్టినా, సురేష్‌కుమార్ దంపతులకు సత్కారం

రీజినల్ అథ్లెటిక్ మీట్‌లో తెనాలి కేవీ పతకాల వేట

తెనాలి: కేంద్రియ విద్యాలయ సంఘటన్, హైదరాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రీజినల్ అథ్లెటిక్ మీట్–2024లో కేంద్రియ విద్యాలయం, జగ్గడిగుంటపాలెం, తెనాలికి చెందిన విద్యార్థులు పలు విభాగాల్లో పతకాలను సాధించారు. కేంద్రియ విద్యాలయ, తెనాలి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ కె.శ్రీకాంత్ సోమవారం ఒక ప్రకటనలో వివరాలను తెలియజేశారు. కేంద్రియ విద్యాలయ, గోల్కొండ–1012కు సంబంధించిన ఆర్మీ, ఆర్టిలరీ స్టేడియంలో ఈనెల 25–27 తేదీల్లో ఈ పోటీలు జరిగాయని తెలిపారు. తమ విద్యార్థులు మొత్తం 21 మంది పాల్గొనగా, వీరిలో పదో తరగతి విద్యార్థి సయ్యద్ రాఫియా (అండర్17) 100 మీటర్లు, 400 మీటర్ల హర్డిల్స్‌లో బంగారు పతకాలను సాధించినట్టు తెలిపారు. 9వ తరగతి విద్యార్థినులు వంగర గాయత్రి హైజంప్‌లో, కె.తత్రోనా ట్రిపుల్‌జంప్‌లో బంగారు పతకాలను సాధించారు. 12వ తరగతి విద్యార్థిని రహనుమా (అండర్19) 100 మీటర్ల హర్డిల్స్‌లో, 80 మీటర్లు, 400 మీటర్ల హర్డిల్స్‌లో కాంస్య పతకాలను కైవసం చేసుకున్నారు. 8వ తరగతి విద్యార్థి డి.కార్తికేయ 80 మీటర్ల హర్డిల్స్‌లో రజతం, 7వ తరగతి విద్యార్థిని యు.అక్షర లాంగ్‌జంప్‌లో రజతం, 9వ తరగతి విద్యార్థిని డి.రిషిత డిస్కస్‌త్రోలో కాంస్య పతకాలను సాధించారు. 4+100 మీటర్ల రిలేలో సయ్యద్ రాఫియా, పి.సంకీర్తన, బి.నమ్రత, ఐ.రాధమ్మ రజత పతకం, 4+400 మీటర్ల రిలేలో జి.శాంతిసుజన, సయ్యద్ రాఫియా, బి.నమ్రత, ఐ.గాయత్రి కాంస్యాన్ని సాధించారు. సెప్టెంబరు 22 నుంచి 26 వరకు ఎర్నాకులంలో జరిగే కేంద్రీయ విద్యాలయ జాతీయ క్రీడలకు తమ విద్యార్థులు సయ్యద్ రాఫియా, వి.గాయత్రి ఎంపికైనట్టు వివరించారు. వీరికి శిక్షణనిచ్చిన వ్యాయామ ఉపాధ్యాయుడు బి.రవికుమార్, కోచ్ డి.అజయ్‌ను అభినందించారు.



పతకాలు సాధించిన విద్యార్థులతో శ్రీకాంత్, రవికుమార్, అజయ్

పారిశుధ్య కార్మికురాలి ఆత్మహత్యాయత్నం

లైంగిక వేధింపులే కారణమా?

పొన్నూరు: పురపాలక సంఘం పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికురాలు లైంగిక వేధింపుల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. విశ్వసనీయ సమాచారం మేరకు..గుంటూరు జిల్లా పొన్నూరు పురపాలక సంఘం ఉన్నతాధికారి నివాసంలో పారిశుధ్య కార్మికురాలు ఏడాది కాలంగా పనిచేస్తోంది. ఆమె కొంతకాలంగా అధికారి లైంగిక వేధింపులకు గురైనట్లు సమాచారం. వాటిని తట్టుకోలేక పది రోజుల కిందట ఆ అధికారి నివాసంలో పనికి వెళ్లేందుకు ఆమె నిరాకరించింది. మూడు రోజుల కిందట ఆమె ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిసింది. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం స్థానిక ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమించడంతో గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉన్నట్లు సమాచారం. జరిగిన సంఘటనపై ఉన్నతాధికారులు పూర్తిస్థాయి విచారణ చేపట్టాల్సిన అవసరం ఉంది. ఆయన గతంలోనూ విధులు నిర్వహించిన వేరే ప్రాంతంలో కూడా పారిశుద్ధ్య కార్మికుల నుంచి లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొన్నారు. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ తిరుమలశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ కుటుంబ కలహాల నేపథ్యంలో కార్మికురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిందని తెలిపారు. ఆమె గతంలో మున్సిపల్ శాఖ నిబంధనలకు విరుద్ధంగా కమిషనర్ నివాసంలో పనిచేసినట్లు పేర్కొన్నారు.

ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే చర్యలు



నరసరావుపేట రూరల్: ఎమ్మార్పీ కంటే అధికంగా విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారులు విత్తన షాపుల నిర్వాహకులను హెచ్చరించారు. సోమవారం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్ సీహెచ్ రవికుమార్, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి.మస్తానమ్మ స్టేషన్‌రోడ్డులోని విత్తన షాపులను తనిఖీ చేశారు. స్టాక్ రిజిస్టర్లు, విత్తనాల సోర్స్ సర్టిఫికెట్లు పరిశీలించారు. విత్తనాలు తీసుకున్న రైతులు కచ్చితంగా బిల్లును తీసుకోవాల్సిందిగా కోరారు. బిల్లు బుక్‌లో రైతుల సంతకాలు తప్పనిసరిగా తీసుకోవాలని, ధరలతో కూడిన బోర్డును తప్పనిసరిగా రాసి ఉంచాలని దుకాణ నిర్వాహకులకు సూచించారు.

ప్రకృతి సేద్యం ఉద్యోగుల జీతాలు చెల్లించాలి

గోరంట్లలోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా

గుంటూరు రూరల్: ప్రకృతి సేద్య విభాగం ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో 16 నెలల బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ ప్రకృతి వ్యవసాయ ఉద్యోగులు గోరంట్లలోని రైతు సాధికార సంస్థ రాష్ట్ర కార్యాలయం వద్ద ధర్నా చేశారు. అనంతరం ఉన్నతాధికారులకు వినతి పత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్సీ కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ ప్రకృతి సేద్య ఉద్యోగుల పోరాటానికి పీడీఎఫ్ ఎమ్మెల్సీల ఫోరం తరఫున మద్దతు తెలుపుతున్నట్టు వెల్లడించారు. కార్యక్రమంలో రైతు సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రాధాకృష్ణమూర్తి కె.హరిబాబు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఆర్వీ నరసింహారావు తదితరులు మాట్లాడారు. ధర్నా అనంతరం రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావుకు ఉద్యోగులు వినతిపత్రం అందించారు. స్పందించిన సీఈవో జీతాలు విడతల వారీగా చెల్లించేందుకు అంగీకారం తెలిపారు. ఉద్యోగులు దిగువ స్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయిలో ఒక గ్రీవెన్స్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అంతకుముందు ఉద్యోగులు గోరంట్ల వేంకటేశ్వరస్వామి దేవస్థానం సెంటర్ నుంచి రైతు సాధికారిక సంస్థ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ ఉద్యోగుల యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శ్రీధర్, వరప్రసాద్, సీఐటీయూ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నేతాజీ తదితరులు పాల్గొన్నారు.



నిరసన ధర్నా నిర్వహిస్తున్న ప్రకృతి వ్యవసాయం విభాగం ఉద్యోగులు



రైతు సాధికార సంస్థ సీఈఓ రామారావుకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ర్యాగింగ్ కేసులో మరో నిందితుడు అరెస్ట్

నరసరావుపేట టౌన్: ఎన్‌సీసీ విద్యార్థిపై దాడి కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు వన్‌టౌన్ సీఐ సీహెచ్ కృష్ణారెడ్డి సోమవారం తెలిపారు. ఎస్ఎస్ అండ్ ఎన్ కళాశాల వసతి గృహంలో జూనియర్ ఎన్‌సీసీ క్యాడెట్‌పై సీనియర్ విద్యార్థులు ర్యాగింగ్ పేరుతో పైశాచికంగా దాడికి పాల్పడిన సంఘటన విదితమే. ఘటనపై బాధితుడి ఫిర్యాదుతో ఆరుగురిపై కేసు నమోదు చేశారు. ఐదుగురు నిందితులను అరెస్ట్ చేయగా, ఆరో నిందితుడు అజయ్‌ను తాజాగా అరెస్ట్ చేశారు.